క్లుప్తంగా

నేడు గృహసారథుల సమావేశం

మండపేట: మండలంలోని పాలతోడు, వెలగతోడు, అర్తమూరు, తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాలకు చెందిన గృహసారథులకు మంగళవారం ఉదయం 10.30 గంటలకు తాపేశ్వరం అతిథి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఏడిద వాసవీ ఫంక్షన్ హాలులో ఏడిద, వై.సీతానగరం, మెర్నిపాడు గ్రామాలకు చెందిన గృహసారథులకు సమావేశం ఉంటుందన్నారు. ఆయా సమావేశాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరవుతారని, గృహసారథులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

ఉపాధ్యాయుడి తీరుపై స్థానికుల ఆందోళన



ఉపాధ్యాయుడి తీరుపై హెచ్ఎం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కాజులూరు: పల్లిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు తోట నాగేశ్వరరావు తీరుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో స్థానికులు పోలీసుల సహకారంతో పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయుడు నాగేశ్వరరావుపై హెచ్ఎం ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తిస్తూ అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. వెంటనే అతడిని పాఠశాల నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. పరిస్థితి పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హెచ్ఎం విద్యార్థుల తల్లిదండ్రులను శాంతింపజేశారు.

ఉప ఎన్నిక ఓటర్ల జాబితా ప్రదర్శన



మున్సిపల్ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలో 21వ వార్డు ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఆ వార్డు కౌన్సిలర్ సూరపనేని శ్రీనివాసు(మాతంగి వాసు) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆ వార్డుకు సంబంధించి ఉప ఎన్నికను నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 21వ వార్డు ఫొటో గుర్తింపుతో ఉన్న ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు త్వరలో జరగబోయే ఉపఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. సదరు ఓటర్ల జాబితాను మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచామన్నారు. ఓటర్ల జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రామచంద్రపురం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

రామచంద్రపురం: విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 91వ వర్ధంతి పురస్కరించుకుని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌లో పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ స్వాతంత్య్ర సంగ్రామంలో ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె. నవీన్‌కుమార్, బి.మధు, ఆదిత్య, ఎం.శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ

అనపర్తి: రామవరంలో కోట్లాది రూపాయల ఖర్చుతో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులకు మార్చి 1న భూమి పూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త మేడపాటి రామలింగారెడ్డి, గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించనున్నామని చెప్పారు. భూమి పూజలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవ్వాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి మల్లిడి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి చింతా రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతితో చెట్టాపట్టాల్..



చెట్లు, కాలువ నీటితో ఆహ్లాదాన్ని పంచుతున్న కపిలేశ్వరపురం లాకుల ప్రాంతం

- వచ్చదనాన్ని కాపాడుకుంటేనే మేలు
- తరిగిపోతున్న చెరువులు, వృక్ష సంపద
- వాటి సంరక్షణ బాధ్యత అందరిదీ

కపిలేశ్వరపురం: మానవుడికి ప్రకృతితో ఎంతో అనుబంధం ఉంటోంది.. నిత్య జీవితంలో అనేక అంశాలు దానితోనే ముడిపడుతోంది.. పచ్చదనంతోనే మనిషి మనుగడ ఆధారపడింది.. అలాంటి పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అంతా బాధ్యత తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.. ప్రస్తుతం ఎండ దంచేస్తోంది.. ఇంట్లో నుంచి బయటకు వచ్చే సగటు జీవిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.. ఈ ఎండలోనైనా చెట్ల నీడన, చెరువుల వద్ద ఉంటే ఆ హాయి వేరు. అలాంటి ప్రకృతి సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో విశాలమైన గ్రామీణ ప్రాంతం, గలగల పారే గోదావరి ఉంది. కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో గోదావరి తీర ప్రాంతం వెంబడి భారీ వృక్షాలు ఉన్నాయి. వాటితో పాటు మండపేట, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లో రచ్చబండలుగా భారీ వృక్షాలు, చెరువులు, పచ్చటి పొలాలు ఆకర్షిస్తుంటాయి. ఇవన్నీ వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. వ్యవసాయ క్షేత్రాల వెంబడి నీటి పారుదల కాలువలున్నాయి.

మన చేతులారా..

ఇళ్లు, రహదారి నిర్మాణాలకు అడ్డు వచ్చాయనో.. వాస్తుకు విరుద్ధంగా ఉందనో.. రాలుతున్న ఆకులను ఊడ్చే ఓపిక లేదనో.. భవనం సుందర దృశ్యానికి అడ్డుగా ఉందనో ఇలా అనేక కారణాలతో చెట్లను నరికేస్తున్నారు. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని కొన్నింటిని అధికారులే తొలగిస్తున్నారు. కొన్ని చెట్లు వయసు మళ్లి నేలకొరుగుతున్నాయి. తాతపూడి కాలిబాట వంతెన వద్ద సుమారు రెండు వందల ఏళ్లు నీడనిచ్చిన రావి చెట్టు కొన్నేళ్ల కిందట సహజ సిద్ధంగా నేలకూలింది. అంగర-కపిలేశ్వరపురం, రామచంద్రపురం-కోటిపల్లి తదితర రహదారుల వెంబడి భారీ వృక్షాలు కాలం చెల్లడంతో తరచూ నేలమట్టమవుతున్నాయి. వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. అలాగే రహదారి విస్తరణలో భాగంగా తొలగించే చెట్లను ఆధునిక యంత్రాల సాయంతో పక్కకు నాటేలా ఏర్పాటు చేస్తే మంచిది.



తాతపూడిలో కాలం చెల్లడంతో నేలకూలిన రావి చెట్టు ఇదే (ఫైల్)

గుండె 'చెరువు'

అంగర, కపిలేశ్వరపురం, టేకి తదితర గ్రామాల్లోని చెరువులు చేపల సాగుతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. నివాస ప్రాంతాల్లోని చెరువులు ఆక్రమణలకు గురై భవనాలు వెలిశాయి. తరతరాలుగా మానవుని గొంతు తడిపింది ఆ చెరువే. వర్షం వచ్చినప్పుడు నిండిన చెరువు ప్రజలు, పశువులకు తాగునీరందించేవి. నీరు తాగేందుకు పక్షులు వందల సంఖ్యలో చెరువు గట్లపై సమీపాన ఉన్న చెట్లపై సంచరించేవి. భూగర్భ జలాలు పెంచేందుకు ఈ చెరువులు ఉపయుక్తంగా ఉండేవి. వీటిని కాపాడుకుని భవిష్యత్తు తరాలకు నీటి వనరులను అందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చతోరణం పేరుతో రహదారుల వెంబడి, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాల్లో ఫలప్రదమైన మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టింది. 2022లో కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్లలో 200, రాయవరం మండలం కురకాలపల్లి, వెంటూరు, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో 1,140, కె.గంగవరం మండలం దంగేరు, యండగండిలలో 260 మొక్కలు, కాజులూరు మండలంలో 1,660 మొక్కలు నాటారు.

అమృత్ సరోవర్‌తో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ సరోవర్ పథకంలో చెరువుల అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాయి. అమృత్ సరోవర్ ట్యాంక్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 2022లో జిల్లాకు 75 చెరువుల చొప్పున మంజూరు చేసి గట్లపై మొక్కలు నాటి, సిమెంట్ బెంచ్‌లను ఏర్పాటు చేసి పార్కులుగా అభివృద్ధి చేసింది. ఇందులో కపిలేశ్వరపురం మండలం నేలటూరు, రాయవరం మండలం వెంటూరు, రామచంద్రపురం మండలం మాలపాడు చెరువులను పార్కులుగా అభివృద్ధి చేసింది. ఈ ఏడాది మండలానికి నాలుగు చొప్పున మంజూరయ్యాయి. చెరువులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వాలకు తోడు ప్రజలూ తమ వంతు సహకారం అందించాలి. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం, చెరువుల వద్ద ఆక్రమణలను తొలగించి శుభ్రపర్చడం, సామాజిక స్థలాలు, పార్కులను పదిలపర్చుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.

> **మొక్కలు పెంచేలా ప్రోత్సాహం**
>
> 
>
> మా ఇంటి ఖాళీ ప్రదేశంలో మొక్కలను పెంచుతున్నాను. చదువుకునే రోజుల్లో తోటి యువకులతో కలసి కపిలేశ్వరపురం, నల్లూరు రహదారుల్లో మొక్కలను నాటి సంరక్షించేవాళ్లం. ప్రస్తుతం పిల్లలకు ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించాలి. ఖాళీ ప్రదేశంలో మొక్కలను పెంచేలా ప్రోత్సాహం అందించాలి.
>
> – పెద్దింశెట్టి రామకృష్ణారావు, సామాజిక కార్యకర్త, అంగర

సీఎం జగన్‌తో పారదర్శక పాలన

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, చిత్రంలో చంద్రకళాదీప్తి, దుర్గారాణి

మండపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పారదర్శక పాలన అందుతుందని, అర్హుల చెంతకే ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో పట్టణంలోని 1–15 వార్డులు, మారేడుబాకకు చెందిన గృహసారథులతో సమావేశమయ్యారు. వారి విధులు, బాధ్యతల గురించి ఎమ్మెల్సీ తోట దిశానిర్దేశం చేశారు. మరింత మెరుగైన పాలన లక్ష్యంగా సీఎం జగన్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గ అబ్జర్వర్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సీఎం జగన్ విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. సమర్థవంతంగా పనిచేయడం ద్వారా ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గృహసారథుల టౌన్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయాన్ని వినియోగించుకోండి



కోరుమిల్లి జగనన్న కాలనీ సమీపంలో తూరల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సోమవారం కోరుమిల్లిలోని జగనన్న కాలనీ సమీపంలో మైనర్ డ్రైన్ తూరల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. కాలనీ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు సాంకేతిక సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, తద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామ శివారు చిన కోరుమిల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ పూజల్లో ఎమ్మెల్సీ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మార్చి 1న స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో ఆలయం వద్ద రెండు రోజులుగా పూజలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సలాది అప్పారావు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదు



కాజులూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కాజులూరు: రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కౌలురైతు సంఘం నాయకులు సోమవారం కాజులూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనలు నిర్వహించారు. రాజబాబు మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ చాలా మోసపూరితంగా ఉందన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌తో పోల్చితే ఈ ఏడాది ఒక్క ఎరువుల సబ్సిడీపైనే 50 వేల కోట్లు, ధాన్యం సేకరణపై 55 వేల కోట్లు, పేదల ఆహార సబ్సిడీపై 90 వేల కోట్లు, ఉపాధిహామీ పథకంపై 30 వేల కోట్లు కోత పెట్టిందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు కురుపూడి భూచక్రం, అల్లాడి నరసింహమూర్తి, నామచంద్రరరావు, గంజా అప్పారావు, చందాల సూర్యనారాయణ, కట్టా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



పూర్ణాహుతి కార్యక్రమంలో బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: అర్తమూరులో ఆబాల గోపాలాన్ని అలరించిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన సోమవారం శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి పర్యవేక్షణలో ఉదయం నుంచి స్వామివారికి నిత్య పూజలు, శాంతి హోమం జరిగాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన గోవింద మాలధారులు, గ్రామస్తులతో ఊరేగింపు నిర్వహించి శ్రీవారికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బులిస్వామిరెడ్డి, కర్రి బాపిరెడ్డి, గజ్జెలకొండ గణేష్‌బాబా, ప్రధాన యాజమాన్య దంపతులు మల్లిడి హరినాథరెడ్డి, సుజాత పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న సమారాధనలో మూడు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీవారికి పల్లకీసేవ, పుష్పయాగం పూజలు చేశారు. వారం రోజుల పాటు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహించిన వేద పండితులను బులిస్వామిరెడ్డి తదితరులు సత్కరించారు. ఉద్దగిరి ఆంజనేయులు, కోనాల సత్తిరెడ్డి, వెలగల శివారెడ్డి, ద్వారంపూడి వీర్రెడ్డి, తాడి రామారెడ్డి, కాయల సత్తిరాజు, సత్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట



ఇజ్రాయిల్‌కు అభినందనలు తెలుపుతున్న రవికుమార్, రుద్రకాంత్ తదితరులు

మండపేట: సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని, ఆయన మాదిగల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం రవికుమార్, వైఎస్సార్ సీపీ నేత మందపల్లి రుద్రకాంత్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మాదిగ సామాజిక వర్గీయులు మండపేట నుంచి ర్యాలీగా అమలాపురం తరలివెళ్లారు. తొలుత 8వ వార్డులోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి రాజరత్న సెంటర్‌లో దివంగత వైఎస్ విగ్రహం వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీగా చేరుకున్నారు. వైఎస్సార్ ఫ్లెక్సీకి పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్, రుద్రకాంత్ మాట్లాడుతూ మాట ఇచ్చినట్టుగానే సీఎం జగన్ మాదిగ సామాజికవర్గానికి ఎమ్మెల్సీ ఇచ్చారని అన్నారు. అనంతరం అమలాపురంలో ఇజ్రాయిల్‌ను కలసి అభినందనలు తెలిపారు. దళిత నాయకులు మందపల్లి సంజీవరావు, మందపల్లి సుధాకర్, కొడమంచిలి భాస్కరరావు, మడికి ఆనందరావు, సుందరుపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

అనపర్తి: స్థానిక బాపనమ్మ గుడి వద్ద గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మిస్తున్న కల్చరల్ యాక్టివిటీస్ భవన నిర్మాణ పనులను అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. భవన నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అనుసూరి సూర్యనారాయణ(బుజ్జి), ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనపర్తి టౌన్ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర బట్టరాజు కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖ చిట్టిరాజు, స్థానిక నేత నల్లమిల్లి నారాయణరెడ్డి, వార్డు సభ్యుడు తేతలి రామకృష్ణారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు తేతలి దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వయసు మళ్లిన వంతెన..



వట్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: అద్దంపల్లి– వట్రపూడిలోని రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరింది. ఇటుగా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం, ద్రాక్షారామలకు ప్రధాన మార్గం. ఈ రహదారిలో వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో వంతెన ఎప్పుడు కూలిపోతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దళితుల మధ్య చిచ్చుపెడితే ఊరుకోం..

ఎమ్మెల్యే వేగుళ్లపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఆశీర్వాదం, బాపిరాజు, సుధాకర్, అర్జున్ తదితరులు

మండపేట: స్వార్థ ప్రయోజనాల కోసం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దళితుల మధ్య చిచ్చుపెడుతున్నారని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై టీడీపీ నేతలు నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని వారు పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు పలివెల సుధాకర్, ఉండ్రాసపు అర్జున్‌లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిరోముండనం అంశాన్ని లేవనెత్తింది ఎమ్మెల్యే వేగుళ్లేనని, దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేయాలనుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. కోర్టు పరిధిలో ఉన్న శిరోముండనం అంశాన్ని కోర్టు చూసుకుంటుందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి త్రిమూర్తులు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. ఆయన విజయంలో దళితులే ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు. సమర్థవంతమైన నాయకుడు కాబట్టే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ తోటకు మండపేట బాధ్యతలు అప్పగించారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా ఎస్సీ కాలనీల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్న ఘనత తోటకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో పనులు పూర్తి చేయిస్తున్నారని, ద్వారపూడి రోడ్డు లాంటి ఎన్నో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, కౌన్సిలర్ కొవ్వాడ బేబి, కోఆప్షన్ సభ్యురాలు కె.శాంతకుమారి, నాయకులు చిన్నం పుల్లేష్, చిక్కాల రాంబాబు, సన్నాల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిపై కేసు

అయినవిల్లి: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎస్.పెదపాలెం వద్ద పసలపూడి సుబ్బారావు, మాగాపు నరేష్, కొట్టాల నవీన్, జనిపల్లి వివేక్, పులిదిండి అదిత్యలు గంజాయి విక్రయిస్తుండగా ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 5 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో బోల్తా పడిన కారు

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లి గ్రామంలో సోమవారం ఓ కారు అదుపుతప్పి డ్రెయిన్‌లో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న డ్రైవర్, మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జయింది. దీనిపై ఏ ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో ఆదివారం రాత్రి జరిగిన చోరీలో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దంగేటి శ్రీదేవి ఆదివారం రాత్రి తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి అక్కడే నిదురించింది. సోమవారం ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు తాళం లేదు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని మూడు కాసుల బంగారు తాడు, 10 తులాల వెండి పట్టీలతో పాటు నగదు అపహరణకు గురైందని గుర్తించి ఆమె పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ పి.బుజ్జిబాబు ఘటనా స్థలం పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

మూడు పూరిళ్లు దగ్ధం

మధురపూడి: కమ్మరి కొలిమి నుంచి రేగిన మంటల కారణంగా సోమవారం మధ్యాహ్నం కోరుకొండ బస్టాండ్ ఎదురుగా మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. వాటిలోని సామగ్రి, నగదు, వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. పీతా సుబ్రహ్మణ్య తన కమ్మరి కొలిమిలో కత్తులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు రేగాయి. అందులోని కార్మికులందరూ బయటకు వచ్చేశారు. కమ్మరి కొలిమిని ఆనుకుని ఉన్న చింతా పాపమ్మ పండ్ల దుకాణం అలాగే కొవ్వూరి లోవరాజు, రమణమ్మ నివాసం ఉంటున్న ఇంటికి మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేసేందుకు స్థానికులు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది రెండు ఇంజిన్లతో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో ఎంఎన్ఆర్ విద్యార్థి ప్రతిభ



హేమంత్ కుమార్‌ను అభినందిస్తున్న అనంత సత్యనారాయణరెడ్డి

అనపర్తి: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్థానిక ఎంఎన్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో జరిగిన జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. ఈ జట్టులో ప్రాతినిధ్యం వహించిన కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థి కె.హేమంత్‌కుమార్ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి హేమంత్ కుమార్‌ను విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి అభినందించారు.